# గోవు మహాలక్ష్మి

పోలాప్రగడ రాజ్యలక్ష్మి

మహాలక్ష్మికి అన్నీ సరదాలే! పాట,మాటన్నా, స్నేహితులన్నా. ఇలా ఎన్నని చెప్పను! అందుకే మహాలక్ష్మిని భర్త మూర్తి ముచ్చటగా పిలుచుకుంటాడు''సరదా'' ఏం చేస్తున్నావని.


''ఆ... పోరూ! మీ పిలుపూ మీరూనూ,'' అని చిరునవ్వు నవ్వుతుంది.

''ఈ వేళ, ఏమిటి? చాలా సరదాగా మాట్లాడుతున్నావు?'' అని మూర్తి ఆఫీసు నుంచి వస్తూనే అడిగాడు.

మహిలక్ష్మి టిఫిన్, కాఫీ అందించి, మెల్లగా పక్కన కూర్చొని, ''ఈ వేళ మిమ్మల్ని ఒకటి అడుగాలనుకుంటున్నాను. కాదనరు కదా'' అని గోముగా గారాలు పోతూ అడిగింది.

''ఆహా ఏదో ఆలోచన వచ్చింది. నీకు అంటే నా పర్సుకి చిల్లుపడిందన్నమాటే'' అన్నాడు నవ్వుతూ. ఛలోక్తి గానూ.

''మిమ్మల్ని అడగకపోతే, నేను ఎవర్ని అడుగుతానండీ'' అంది.



''అడుగూ! కొనవలసినదా? తినవలసినదా? చూడవలసినదా? ఏమిటో చెప్పు'' అన్నాడు మూర్తి.

'' అవేం కావు.''

''మరి బంగారమా?''

''అదీకాదు''

''మరి చెప్పవే, నా సరదామణి'' అన్నాడు మూర్తి.

''కొంటానంటే చెబుతాను''

''అది ఏమిటో చెబితేనే కొంటాను.''

''ముందు ప్రామిస్ చేస్తేనే, చెబుతాను'' అంది మహాలక్ష్మి ఇంతలోనే అయిదేళ్ళ బాబిగాడు వచ్చి 'పాపం అమ్మ అడుగుతుంది. కొంటానని చెప్పు' అని మూర్తి వీపు మీద వాలి గారాలు పోతూ అడిగాడు తండ్రిని.

'' ఆ.... సరే, అలాగే కొంటాను, అన్నాడు మూర్తి.

''మరీ, మరీ మనం 'ఆవు'ను కొనుక్కుందా మండీ,'' అంది మహాలక్ష్మి.

''ఏమిటీ? నీకు మతుందా? ఫ్లాట్సులో కాపురం, పైగా లక్ష ఖరీదు ఉంటుంది. నీకీ ఆ ఆలోచన ఎలా వచ్చిందే, నన్ను చంపుక తింటానికి''

''అంత మాట అనకండి. ఏదో సరదాగా, ఉందనీ!!'' అంది మహాలక్ష్మి.

ఇంక ఆ రోజు నుంచి మహాలక్ష్మి ఇంట్లో హంగామా చేయడం మొదలెట్టింది.

గిన్నెలూ, చెంబులూ,, చప్పుళ్ళు చేయడం, మాట్లాడక పోవడం, ప్రతి దానికీ బాబిగాన్ని అరవడం. కారణం లేకపోయినా రెండు దెబ్బలు వేయడం, వీధిలోకి పోయి, ఆడుకోమనడం, ఇంట్లో రణగొణ ధ్వని చేయడంతో మూర్తికి స్థిమితం పోయింది.

మెల్లగా చెప్పాడు, గట్టిగా చెప్పాడు, ఇంట్లో సరదా అనేదే పోయింది... చివరికి

'' సరే, ఆవుని కొంటాను ఎక్కడ కట్టేస్తావు? ఒక రూములోనా?'' అన్నాడు ఆఖరికి భార్యతో రాజీకి వచ్చిన మూర్తి.

పకపక నవ్వి '' భలే వారే నేను అంత అమాయ కురాల్నా, అది ముందే ఆలోచించాను. అందరూ, వాళ్ళు కార్లు పెట్టుకుంటున్నారు. మనం కారు పెట్టుకునే స్థలంలో, ఆవును కట్టేస్తాం'' అంది మహాలక్ష్మి ఆనందంతో,

''అది సొసైటీ ఒప్పుకోదే పిచ్చి మొహమా'' అన్నాడు మూర్తి కోపంతో

''ఎవరిష్టం వారిది'' అంది

''ఆవు అంటే, పేడా, గత్రా చాలా గలీజు అవుతుంది'' అన్నాడు.

ఆ మాత్రం నాకు

# కథ


తెలియదా! తెల్లవారగట్ల లేచి ఆవు సేవ చేసుకుంటే పుణ్యమని, గోమూత్రం, ఆయుర్వేదంలో వాడతారనీ, మొన్న టీవిలో చెప్పారా, ఆవు పాలు వంటికి మంచిదనినూ బామ్మ చెప్పేది. మా చిన్నప్పుడు ఆవు పాలే తాగేవాళ్ళం అందుకు ఇంత తెలివిగా ఉన్నాను.'' అంది మురిసిపోతూనూ.

''ప్రతి దానికీ నాలా ఆలోంచించడం నేర్చు కోవాలి మీరు. మరి, వాళ్ళు కారుని కడుగుతుంటారు కదా? పెట్రోలు వాసన వస్తుంది కదా? దీని సంగతి సరే ఒక పూట పాలు మనం వాడుకుందాం, రెండో పూట ఎవరికైనా అమ్మేద్దాం. ఆవు కొన్న ఖర్చు వచ్చేస్తుంది.'' అని ఒక ధీర్ఘ ఉపన్యాసం ఇచ్చేసింది మహాలక్ష్మి.

''సొసైటీ ప్రసిడెంటునీ, సెక్రటరీని అడిగి మరీ కొంటానంతే'' అన్నాడు మూర్తి.

''వాళ్ళనడిగితే ఒప్పుకోకపోవచ్చును, వాళ్ళు కారు కొనేటప్పుడు అందరినీ అడిగే కొన్నారా?'' అంది మహాలక్ష్మి.

''ఇది ఆవు కదా? కొంచెం ఎవరినైనా, సలహా అడగాలి. ఎక్కడమ్ముతారో, ఎంత ఖరీదో తెలుసు కోవాలి, నా బుర్రలో ఆవుని తోలుకొచ్చి పెట్టావు మహాలక్ష్మి. నీ సరదా పాడుగానూ ఇంతకన్నా, ఇంత ఖరీదైన వడ్డాణమేనా నీ నడుముకి కొంటాను కానీ, ఆవు వద్దే'' అన్నాడు మూర్తి, బేలగా, బెదురు చూపులు చూస్తూనూ.



'' అదీ కొందురుగాని, పాలమమ్మిన డబ్బు పెట్టి'' అంది, ఆనంద తోనూ,

మూర్తికి భార్య ఇంత అజ్ఞాని అని ఇన్నాళ్ళు తెలియక, ఆమెను సరదా, సరదా, అని పిలిచి, నెత్తిన ఎక్కించుకున్నాను. అని అనుకున్నాడు బాధతో. తనలో తానే అనుకొన్నాడు పైకంటే, రేపు ఆఫీసు వేళకి అన్నం రాదని భయపడ్డాడు మూర్తి.

ఆఖరికి, ఆఫీసులో లోను పెట్టి, ఆవు కొన్నాడు,

ఆవు వచ్చాక, దూడతో నేను ఆడుకుం టాను, ఇంక సైకిలు వద్దు అన్నాడు బాబిగాడు గెంతులేస్తూ.

ఆవు కొనడానికి లోను ఏమిట్రా, లీటరు పాలు, కొనుక్కుంటే సరిపోయే దానికి అన్నారు ఫ్రెండ్స్, ''అది అంతే లేరా? నా భార్య సంగతి మీకు తెలియదు. ఆమె జాతకం చాలా గొప్పది, ఆవిడకి ఆలోచన వస్తే, ఇలా జరిగిపోతుంది. అది నా అదృష్టం'' అని బాధగా చెప్పాడు. వాళ్ళు జాలిగా చూసారు.

మహాలక్ష్మి ఆవు రాగానే దిష్టి తీసి, దానికి కుంకమ బొట్టు పెట్టి, కాళ్ళకు పసుపురాసింది. హారతి ఇచ్చింది. ఒక స్తంభానికి తాడుతో కట్టేసారు. దూడని ఇంకో స్తంభానికి కట్టేసారు. అంబా, అంబా అని అరుపులు విని అందరూ వచ్చి చూసారు.

''ఈ ఆవు ఏమిటీ! అని కొందరు అడగడం, ఏమో నాకు తెలియదంటే, నాకు తెలియదని అన్నారంతానూ! వాచ్‌మెన్‌ను పిలిచి ఎవరిదీ ఆవు అని ఆరా తీసారు.''

''2/డి హౌస్ నెంబర్ వారిది'' అని చెప్పాడు.

''వెళ్ళి మూర్తిగానికి పిలుచుకురా'' అని పంపించారు.

''నేను రాను, ఆ.. అడిగేవారెవరో, ఇలా రమ్మను'' అన్నాడు మూర్తి. కుడి చేత్తో సంజ్ఞ చేస్తూనూ.

ఫ్లాట్సులో కొందరు అడగడానికి వచ్చారు, కోపంగా. ''మూర్తి గారు ఆవును కొన్నారా? ఎవరదైనానా? అన్నారు ముక్తకంఠంతో అందరూ.

''ఎవరిదో, ఏమిటి? లక్ష రూపాయలు పెట్టి కొన్నాను'' అన్నాడు మూర్తి దర్పంగానూ.

''అదేమిటండీ, పేడా, అది గలీజు వాసనా'' అన్నారు.

''ఏం? కారు పెట్రోలు వాసన వేయడం లేదూ, అల్లాగే ఇదీనూ'' అంది మహాలక్ష్మి కోపంగానూ.

''ఇంకా, ఇది ఆరోగ్యానికి మంచిది, మా ఇష్టం మాది, మా కారు పెట్టుకునేచోట, ఆవు, దూడ ముచ్చటగా, కలకలాడుతుంది. ఆవుకి ఉదయమే వాకింగ్‌కి వెళ్ళేటప్పుడు దణ్ణం పెట్టుకోండి. ఎక్కువ గోడవ చెయ్యకండి, వెళ్ళండి, ఎప్పుడైనా కావలిస్తే అడగండి కొన్ని పాలు పోస్తాం'' అంది మహాలక్ష్మి. సోఫాలో దర్జాగా కూచుంటూ, తన పెద్ద జడని వయ్యారంగా ముందుకు వేసుకుంటూనూ.

''నువ్వు మాకు పాలు ఏం పోయక్కరలేదు కాని, దాని వాసనను భరించలేము'' అన్నారు వాళ్ళు,

అయిదేళ్ళ బాబిగాడూ, ''ఇంక పోండి వాసనగా ఉంటే సెంటురాసుకోండి'' అన్నాడు కిలకల నవ్వుతూ.

''ఆ.. అంత వరకూ వచ్చిందా మీ సంగతి. తెల్లవారేటప్పటికా ఆవును కట్టినచోట ఖాళీ చేయాలి.!!'' అన్నారు అంతా.

''ఇప్పుడు దాన్ని ఏం చేయమంటారు? అని అన్నాడు మూర్తి.

''ఏమో మీ బెడ్‌రూంలోనో, కిచెన్‌లోనే కట్టేసుకోండి.'' అని అంతా పకపక నవ్వారు.

మహిలక్ష్మి, మూర్తికి, అయిదేళ్ళ బాబికి అంత వరకూ వున్న ధైర్యం తగ్గింది. బేలగా అయిపోయారు.

అందరూ, వెళ్ళి పోతూ, ఏ విషయం రేపు తేల్చుకుందాం అన్నారు.

ఆ మాటలు మనసుకు ముల్లులా గుచ్చుకొన్నాయి మూర్తికి.

మీరు మరీ బాధపడకండి అని మహాలక్ష్మి ఊరడించింది.

''అది సరే, రేపు ఉదయమే పాలు పిండడం ఎలాగా'' అని? ప్రశ్నించాడు భార్య మహాలక్ష్మిని మూర్తి.

''అబ్బే! దాందేముంది. వెనక కాళ్ళకి పగ్గం ముడిపెడదాం, ముందు కాళ్ళని మీరు పట్టుకోండి, నేను పాలు పిండుతాను అంతే, అన్నట్టు ముందు దూడ ముండకి పాలు తాగడానికి వదలాలండోయ్'' అంది కులుకుతూ.

''అమ్మ నేను దూడను పట్టుకొని పాలు తాగిస్తానే, అన్నాడు బాబిగాడు.'' సరదా పడుతూ.,

'' నీవుండరా వేధవా? అని. తెల్లవారగట్లే లేచి ఆవు దగ్గర శుభ్రం చేసిన ముగ్గులు పెట్టి, ముందు దాన్ని కడగాలి'' అన్నాడు మూర్తి.

'' అలాగే నాకవన్నీ తెలుసును.'' అంది

''నీవు అనుకున్నంత సులువేంకాదు. ఆవు తన్నిందంటే, రెండు రోజుల వరకు మంచం పడుతావు. నీ తెలివితో నా బుర్రనంతా ఖరాబు చేసావు. అయినా ఉండు. వాచ్‌మెన్‌తో మాట్లాడి వస్తానని వెళ్ళాడు, పాలు పిండటానికి మనిషి కావాలన్నాడు.''

''సార్ చూద్దామండీ'' అన్నాడు.

''ఎంత అడుగుతాడంటావు?'' ఏవరేజిన అన్నాడు.

''పదిహేను వందలు నెలకు అడగొచ్చు.''

''వీలైతే వెయ్యికి ఒప్పిద్దాం'' అన్నాడు మూర్తి.

''అడ్వాన్సు అడుగుతాడు?'' అన్నాడు వాచ్‌మెన్.

''అయిదు వందలేనా అలాగే ఇద్దాం, రేపే చూడు'' అన్నాడు.

''కరువు రోజులు కందండీ, వెయ్యికి రాకపోవచ్చును''

'' సరే అలాగే కానీ'' అని లిఫ్టు దగ్గకకి వచ్చాడు మూర్తి.

ఫ్లాట్సు ప్రసిడెంట్ కనిపించి, ''ఏమిటండీ ఈ దారుణం, ఆవును కొన్నరట''? అని అడిగాడు.

''నా గొడవ మీకెందుకు, కారు పెట్టుకునే చోట ఆవును కట్టేస్తాం'' అన్నాడు.

''అదేం కుదరదు, రూల్సు ఒప్పుకోవు'' అన్నాడు ప్రసిడెంట్, మూర్తికి ఆ మాటలు మనసుకు తగిలాయి అవమానంతో తలకొట్టేసినట్లయింది.

భోజనాలయ్యాక, అంతాపడుకున్నాక, అన్నట్టు ఆవుకి బకెట్టుతో మంచినీళ్ళు పెట్టాలండీ అని పట్టికెళ్ళి పెట్టింది. మహాలక్ష్మి,

రాత్రి పన్నెండు అయినా, ''అంబా, అంబా'' అని అరుస్తోంది ఆవు.

''దానికి ఆకలో, ఏమిటో, ఆవుని కొన్నప్పుడు చిట్టూ, తవుడూ కొనొద్దా?'' అని మొగుణ్ణి కోప్పడింది.

''అవును కదూ...!'' అన్నాడు మూర్తి.

''పోనీ... నా బిస్కట్టు ప్యాకట్టు పట్టుకెళ్ళి పెట్టండి'' అన్నాడు బాబిగాడు.

''నువ్వింకా పడుకోలేదా! వెధవా?'' అంది మహాలక్ష్మి. ఫోన్ మోగింది, ''మీ ఆవు అంబా అరుపులకు నిద్రరావడం లేదు బాబోయ్. తెల్లారి లేవాలి, ఆఫీసులకు వెళ్ళాలి, ఇలా అయితే మా ఉద్యోగాలేమి చేస్తాం అని?'' హెచ్చరించారు ఫ్లాట్సులోని కొంతమంది.

మూర్తి బుర్ర పాడైంది. రేపు ఆఫీసులో పని ఎలాగా? అని రాత్రంతా ఆలోచించాడు. ''అంబా, అంబా'' అని అరుపులు వినిపిస్తూనే ఉన్నాయి. మహాలక్ష్మి చీకటతోటే లేచి, గోవుకు స్నానం చేయించి, బొట్టు పెట్టి పూజలు చేద్దామని, తీరా వెళ్ళి చూస్తే అక్కడ ఆవూ,దూడా లేవు.

''ఏమండీ లేవండీ, గేటు వేసే ఉంది వాచ్‌మెన్ అక్కడే ఉన్నాడు, ఆవూ,దూడా లేదండీ'' అని బోరున ఏడుస్తూ భర్త మూర్తి దగ్గరకొచ్చింది.

''ఏమో నాకు తెలియదు'' అన్నాడు నిర్లక్ష్యంగానూ, ముఖం అటు తిప్పి,

''అదేమిటి? లక్షరూపాయల ఆవుపోతే, ఏడవరేమిటండీ'' అంది బాధతో కళ్ళుఒత్తుకుంటూనూ.

''మీరే ఏదో చేసారు, చెప్పండి, చెప్పండి అని అరిచింది. నీతో, అదే చిక్కు. నిజం చెపితే బాధపడుతావు. నిన్ను ఇంక సరదా అని పిలవనే'' అన్నాడు మూర్తి.

''అసలు సంగతి చెప్పండి'' అంది, మహాలక్ష్మి

''రాత్రికి రాత్రి వాచ్‌మెన్ సహాయంతో ఆవును, దూడను ఎక్కడైతే కొన్నానో అక్కడే అమ్మేసి వచ్చాను. పదివేలు తక్కువకి కొన్నాడు'' అన్నాడు మూర్తి.

ఆ... అని నేలమీదకు ఒరిగింది మహాలక్ష్మి నిరాశాతో...

*

